manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 01 | సంచిక : 213 | గురువారం | 30.01.2025




## జర్నలిస్టులకు అండగా
# టీఎస్‌జేయూ

- ప్రభుత్వం తెలంగాణ మీడియా పాలసీ ప్రకటించాలి
- ప్రత్యేక ప్రెస్ మీడియా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి
- తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం గౌడ్

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :**

తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తూ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారగౌని పురుషోత్తం గౌడ్ తెలిపారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ జనగామ జిల్లా కమిటీ ఎన్నిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ అధ్యకతన బుధవారం రోజున జిల్లా కేంద్రంలో జరిగినది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగౌని ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజాస్వామ్య విలువలు కాపాడడంలోనూ అలాగే ప్రజా సమస్యలు వెలుగులోకి తీసుకురావడమే కాకుండా వాటి పరిష్కారానికి కూడా కృషి చేస్తున్న చిన్న పత్రికల పరిస్థితి చాలా దయనీయంగా ఉందన్నారు. గత ప్రభుత్వం ఎన్నో ప్రమాణాలు చేసినప్పటికీ ఒక్కటి అమలుకు నోచు కోలేదని, వందలాది చిన్న పత్రికలు ఎంపానెల్మెంట్ లేక ప్రభుత్వ ప్రకటనలు రాకపోవండంతో ఆయా పత్రికల యాజమాన్యాలు దుర్భర పరిస్థితి ఎరుకొంటున్నాయన్నారు. వీటి గురించి అన్ని విషయాలు స్పష్టంగా తెలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే వీటిని ఆదుకుని తెలంగాణ అస్తిత్వాన్ని నిలబెట్టాలని కోరారు. ప్రభుత్వం వెంటనే పట్టించుకుని, ఆర్థిక సహాయ ప్యాకేజీలను ప్రకటించాలని ఆయన కోరారు. అలాగే తెలంగాణ మీడియా పాలిసినీ ప్రకటిండం, తెలంగాణ ప్రెస్ అండ్ మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ భూమి పుత్రులైన పాత్రికేయులకు మాత్రమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు తమ జీవితాన్ని పత్రికా రంగానికి అంకితం చేసి, ప్రజల గొంతుకగా నిలుస్తున్నారన్నారు . జర్నలిస్టు స్కీమ్ లలో యూనియన్ల పాత్రను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. టీఎస్‌జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న యూనియన్లు జర్నలిస్టు ల సంక్షేమం కోసం కాకుండా తమ వ్యక్తిగత ప్రయోజనాలకే పరిమితమయ్యాని విమర్శించారు. అలా కాకుండా తాము ఒక ప్రత్యామ్నాయ జర్నలిస్టు ఉద్యమ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా ఉప్పలంచి నరేందర్
- ప్రధాన కార్యదర్శిగా బొమ్మగాని శ్రీకాంత్ గౌడ్





తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (టీఎస్ జేయూ) జనగామ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఎస్ఎస్ఎన్ గార్డెన్స్ లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నారగౌని పురుషోత్తం గౌడ్, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఉప్పలంచి నరేందర్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మగాని శ్రీకాంత్ గౌడ్, కోశాధికారిగా కొన్నె ఉపేందర్, ఉపాధ్యక్షులుగా గంగిశెట్టి మహేశ్ కుమార్, గుడికందుల కృష్ణ, చిటుకుల అంజనేయులు, వల్లాల మధు, సహాయ కార్యదర్శులుగా జి.ప్రవీణ్ కుమార్, పి.రాజు, పన్నీరు గోవర్ధన్, కార్యవర్గ సభ్యులుగా చెల్లోజు నవీన్ చారి, పోచంపల్లి రజిత శ్రీనివాస్, గన్ను కార్తీక్, చిటుకుల అశోక్, ఓంకార్, సల్లా రవీందర్, ఎండీ.అఫ్రోజ్, రమేశ్ యాదవ్, మహిపాల్, తుంగ కౌశిక్, గుండా రాజు, బాలు ఎన్నికయ్యారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎం.శివకుమార్, గౌరవ సలహాదారుడిగా చీల కిరణ్ కుమార్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర నాయకత్వంతో పాటు జిల్లా జర్నలిస్టులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.






## టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి 2

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా



## రైతు శ్రేయస్సు కోసమే భూ భారతి.. 3

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



## రెవెన్యూ డివిజన్ కోసం అలుపెరుగని పోరాటం 2

- నేడు చేర్యాలలో మహా ధర్నా

General News



# టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

## జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి : అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఎడోద్వాజ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ మధులాష్ బాబు నేతృత్వంలో ప్రారంభమైన ఫ్లో బస్సు (ఫ్యూచర్స్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్) కలాం స్ఫూర్తి యాత్ర బుధవారం జిల్లాలోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఫ్లో బస్సులోని ఐవోటీ, ఏఆర్/వీఆర్, రోబోటిక్స్, ఏఐ, 3డీ ప్రింటింగ్ వంటి 16 ఆధునిక సాంకేతికతలను తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి సైన్స్ అండ్ టెక్నాలజీ మీద అవగాహన కలిగి ఉండటమే కాకుండా నూతన ఆవిష్కరణల దిశగా టెక్నాలజీని ఉపయోగించే స్థాయికి ఎదగాలన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో ప్రారంభమైన ఈ యాత్ర, ఆధునిక సాంకేతికతను రాష్ట్రంలోని విద్యార్థులకు చేరవేసి, వారికి ఆవిష్కరణశక్తి, శాస్త్రీయ ఆసక్తిని పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోందన్నారు. ఈ మొబైల్ సైన్స్ ల్యాబ్ ద్వారా సాంకేతికతలను బహిర్గతం చేయడమే కాకుండా విద్యార్థులకు సృజనాత్మకతను పెంపొందించి ప్రాక్టికల్ అనుభవాన్ని కూడా అందిస్తుందన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానంపైన అవగాహన పెంచుకుంటే వారు కేరిర్ లో ఉన్నత స్థానంలో నిలబడతారన్నారు. అనంతరం సాంఘిక సంక్షేమ పాఠశాల వంట గదిని, సరుకులని, టాయిలెట్స్ ను కలెక్టర్ పరిశీలించారు. వంట గదిలో వంటల తయారీ విధానాన్ని చూసి ఆ తర్వాత విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. కార్యక్రమంలో డీసీవో, ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, ఫ్లో బస్ బృంద సభ్యులు శ్రీజ సోగల, అర్చన నాగపురి, ఎన్ అజయ్ రెడ్డి, దిలీప్ కుమార్, సాయి సుబ్రమణ్యం, రోహిత్ జలగం, ఫ్లో బస్సు పైలట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.





# ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర కీలకం



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులదే కీలక పాత్ర అని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన నోడల్ అధికారులతో బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ హాల్లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి కలెక్టర్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోడల్ అధికారులందరూ వారికి కేటాయించిన అంశాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పంచాయతీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా పనిచేయాలని న్నారు. అనంతరం ఎంపీడీఓలతో సమీక్షిస్తూ గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి ఆన్లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ మాధురి షా, డీఆర్డీఓ వసంత, డీపీవో స్వరూప రాణి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో బుధవారం రైతుల కోసం భూ భారతి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డికి మంచుప్పుల గ్రామానికి చెందిన దళితులు సాదిక్ అలీ న్యాయవాది ఆధ్వర్యంలో కలిసి తమ భూ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. గత 8 ఏళ్లుగా తమ న్యాయమైన పోరాటాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఈ ప్రభుత్వమైన సమస్యను తీర్చాలని కోరారు. తాము నివాసం ఉంటున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు త్రాగు నీటి వసతి, కరెంటు లేకుండా అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆమె తో విన్నవించి వాపోయారు. నెల రోజుల్లోపు తమ సమస్యలను పరిష్కారం చేయకపోతే ఆందోళన చేపడుతామని దళితులు అనంతరం మీడియాతో తెలిపారు. ప్రజా పోరాటమే శరణ్యం అని అలాంటి అవకాశం లేకుండా ఎమ్మెల్యే పల్లెను సందర్శించాలని కోరారు.



# నేటి మహాధర్నను విజయవంతం చేయండి

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల రెవిన్యూ డివిజన్ సాధించే వరకు అలుపెరుగని పోరాటాలు చేయాలని అందులో భాగంగానే నేడు గురువారం పట్టణ కేంద్రంలో జరిగే మహా ధర్నాకు ప్రతి గ్రామం నుండి ఇంటికొక్కరుగా తరలి రావాలని రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ వకులభరణం నర్సయ్య పంతులు అన్నారు. బుధవారం రోజున చేర్యాల పట్టణ కేంద్రంలోని స్థానిక అంగడి బజారు చౌరస్తాలో నేడు జరిగే మహాధర్నా సభ స్థలాన్ని అఖిల పక్ష పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ నర్సయ్య పంతులు మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ అనేది ఇక్కడి ప్రాంత ప్రజల ఆకాంక్ష అని, అందుకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం డివిజన్ అంశంపై కాలయాపన చేయకుండా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం డివిజన్ ను ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చే కార్యక్రమంలో భాగంగా,(నేడు జనవరి 30 వ తేదీన) చేర్యాల పట్టణ అంబేద్కర్ సర్కిల్లో సుమారు 2000 మందితో మహా ధర్నాను నిర్వహించనున్నట్లు తెలిపారు . ఈ ధర్నాకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు,సిపిఎం ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర నాయకులు పొగాకు జయ రామచందర్, తోపాటు అన్ని పార్టీల ముఖ్య నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ మాహా ధర్నా కు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామల ప్రజలు, స్వచ్ఛందంగా పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని ఆయన ప్రజలను కోరారు.




# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల అందజేత

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** లయన్స్ క్లబ్ ఆఫ్ బచ్చన్నపేట ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ పడమటి కేశ్వాపూర్, జడ్పీహెచ్ఎస్ కట్కూర్ పాఠశాలలోని 10 వ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, అలిన్ వన్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో 320F జిల్లా జీఎస్టీ కో ఆర్డినేటర్ లయన్ రమణారెడ్డి , బోర్డు ఆఫ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి , పూర్వ జిల్లా రీజియన్ చైర్మన్ ఈదులకంటి ప్రతాప్ రెడ్డి మరియు పూర్వ జోనల్ చైర్పర్సన్ చల్లా శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

Local News




# భూభారతి చట్టాలపై అవగాహన

## పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**పాలకుర్తి, మన చౌరాస్తా :** లిఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గంలో భూ భారతి చట్టం, ఇతర భూ చట్టాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి మాట్లాడుతూ రైతులకు భూ భారతి చట్టం ప్రాముఖ్యతను వివరించారు. ఈ చట్టం ద్వారా భూ రికార్డుల నిర్వహణ సులభతరం అవుతుందని, భూ హక్కుల పరిరక్షణకు ఎంతగానో సహాయపడుతుందని తెలిపారు. భూ భారతి చైర్మన్ కోదండ రెడ్డి మాట్లాడుతూ.. భూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. రైతులు తమ భూములపై పూర్తి హక్కులను తెలుసుకోవడం ద్వారా భూ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనగలరని, రైతులకు న్యాయ పరంగా ఎంతగానో సహాయపడుతుందని వివరించారు. భూ భారతి చట్టం రూపకర్త భూమి సునీల్ గారు మాట్లాడుతూ.. ఈ చట్టం ద్వారా భూ రికార్డుల నిర్వహణ, పరిరక్షణతో పాటు భూ వివాదాల పరిష్కారం వంటి అంశాలు ఎలా సులభతరం అవుతాయో వివరించారు. రైతులు ఈ చట్టం ద్వారా పొందగల ప్రయోజనాలను వివరించారు. ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ.. భూ సంస్కరణలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. రైతుల హక్కులను పరిరక్షించడానికి భూ చట్టాలలో మార్పులు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి.. రైతుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. భూ భారతి చట్టం అమలులో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ కుమార్ సింగ్, ఆర్డీవోలు, ఎమార్వోలు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, సీనియర్ నాయకులు, రైతు సోదరులు, యువ నాయకులు, రైతులు పాల్గొన్నారు.




## మంద కృష్ణ మాదిగకు సన్మానం

**హైదరాబాద్, మన చౌరాస్తా :** హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి డాక్టర్ల సమావేశంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 'లక్ష డప్పులు వేల గొంతులు' పాటను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిప్పారపు లక్ష్మణ్, డాక్టర్ ఆదాం, డాక్టర్ రాజమౌళి, డాక్టర్ సుధా సుగుణాకర్, డాక్టర్ చక్రపాణి, డాక్టర్ కిషన్ పాల్గొన్నారు.

## ఆర్టీవో ఆఫీసులో ఆరోగ్య శిబిరం

**చేర్యాల, మన చౌరాస్తా :** జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా చేర్యాల ఆర్టీవో ఆఫీసులో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా లారీ డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు, ట్రాక్టర్ డ్రైవర్లకు, మోటారు క్యాబు డ్రైవర్లకు స్కూల్ బస్ డ్రైవర్లకు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా చేర్యాల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ క్రిస్టోఫర్ వాహనదారులకు వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, పరిమితికి మించి సరుకులు గానీ, మనషులను గానీ తీసుకుని వాహనాలు నడపరాదని తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో డాక్టర్ సందీప్ డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో చేర్యాల ఏఎంవీఐ నేహా, జూనియర్ అసిస్టెంట్ ఎర్రన్నగారి జితేందర్ రెడ్డి, కానిస్టేబుల్ విక్టోరియా, రాకేష్, లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు బద్దిపడిగె నర్సిరెడ్డి , హుసన్ డ్రైవింగ్ స్కూల్ యజమానులు శివకుమార్, రమేష్, ప్రైవేట్ పాఠశాలల యజమానులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గత 30 సంవత్సరాల నుంచి ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ కోరుతూ పోరాటం చేస్తున్న సందర్భంగా ఎస్సీలలో ఉండబడిన 59 ఉపకులాలకు, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ రంగాలలో సమన్యాయం జరగాలని జరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆగస్టు 01,2024న ఎస్సీ వర్గీకరణ చేసుకునే అధికారం ఆయా రాష్ట్రాలకు కల్పిస్తూ తీర్పునిచ్చింది. హామీని నెరవేర్చాలని హైద్రాబాద్ కేంద్రంగా నిర్వహించ తలపెట్టిన "వేల గొంతులు లక్షల డప్పుల" మహా ప్రదర్శనను జయప్రదం చేయడంలో భాగంగా తమరి



సంపూర్ణ మద్దతు తెలియజేసి, ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరుతూ అందుకు గాను ఈనెల 31 శుక్రవారం రోజు పద్మశాలి భవన్ లో సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తమ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలవాలని కోరుతూ బుధవారం ఎమ్మార్పీఎస్ చేర్యాల మండల శాఖ పక్షాన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్లిగారి యాదగిరి, డివిజన్ ఇంచార్జి సనవాల ప్రసాద్, టౌన్ అధ్యక్షుడు భూమిగారి మధుకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్మ ఆగంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, అల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందె బీరన్న, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం, టీడీపీ, బీఎస్పీ పార్టీల ప్రతినిధులు, కుల సంఘాలకు వినతిపత్రం అందజేశారు.



## రోడ్డు భద్రత మాస ఉత్సవాలు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తిలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. పలు విద్యాలయాలకు చెందిన విద్యార్థులతో ట్రాఫిక్ రూల్స్ పాటించడం, హెల్మెట్ ధరించడం, ఇతరత్రా భద్రత అంశాలపై ఆర్టిఓ, పోలీస్ అధికారులు అవగాహన కల్పించారు. పాలకుర్తిలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో 45 మంది మరణించారని జిల్లా అధికారి గౌడ్ తెలిపారు. సిఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. రోడ్డు భద్రతా నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఎస్సైలు పవన్ కుమార్ శ్రావణ్ కుమార్, రవీందర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





## టెన్త్ విద్యార్థులు ఆలిన్ వన్ బుక్స్

**జనగామ, మన చౌరాస్తా :** లయన్స్ క్లబ్ ఆబాద్ జనగామ ఆధ్వర్యంలో ఓబుల్‌కేశ్వాపూర్ జెడ్పీ హెచ్ఎస్‌లో 10వ తరగతి విద్యార్థులకు ఆలిన్ వన్ పుస్తకాలు అందజేశారు. రూ.450 విలువైన ఒక్కో సెట్టు ఇరవై మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో దాత క్లబ్ 320 f జిల్లా కో ఆర్డినేటర్ హరికిషన్ రెడ్డి, జోన్ చైర్మన్ శ్రీభాష్యం రఘు, శ్యాం సుందర్, సురేష్, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిరుపేదల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ పాలన సాగిస్తోందని సాల్వపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు బత్తిని వెంకటేశ్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్షేమపథకాలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీ పథకాలను అర్హులకు అందించి పథకాలను సంక్షేమఫలాలు, ప్రయోజనాలు ప్రతిఒక్క రికీ అందడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టుకుంటామనే వారికి ప్రాధాన్యత ఉంటుందని, ఈజీఎస్ కూలీలకు నిబంధనల మేరకు సోమవారం వారివారి ఖాతాల్లో ఆరువేల రూపాయల చొప్పున జమఅవుతాయని అన్నారు. ఇందిరమ్మ ఇంటి కింద 5 లక్షల రూపాయలు మంజూరు అవుతాయన్నారు. గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డు లేకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అర్హులందరికీ రేషన్ కార్డు మంజూరు చేసిన ఘనత దక్కుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పేదవాడి ఇంటికల నెరవేరిందని వారన్నారు. జనగామలో డిసిసి అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఆయన ద్వారానే జనగామ అభివృద్ధి చెందుతుందన్నారు.






## నా జీవితాన్ని గౌరవిస్తా..

నా జీవితాన్ని గౌరవిస్తాను అని సినీ హీరోయిన్ రష్మిక అన్నారు. ప్రస్తుతం విక్కీ కౌశల్‌తో కలిసి 'ఛావా' అంటూ రష్మిక సందడి చేయనున్నారు. లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14వ తేదీన విడుదల కానున్న సందర్భంగా ఈ సినిమా ప్రచారంలో భాగంగా నిర్వహించిన ఇంటర్వ్యూలో రష్మిక మాట్లాడుతూ..'నాకు సంతోషకరమైన ప్రదేశం ఏది అని అడిగితే వెంటనే ఇల్లు అని చెబుతాను. ఇంట్లో ఉంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. పాజిటివ్‌గా అనిపిస్తుంది. ఎక్కడా పొందలేని ఆనందం ఇంట్లో లభిస్తుంది. ఎంతోమంది ప్రేమాభిమానాలు పొందినప్పటికీ నేను ఒక కుమార్తె, సోదరి, భాగస్వామిగా నా జీవితాన్ని గౌరవిస్తాను. అది పూర్తిగా నా వ్యక్తిగత జీవితం' అని చెప్పారు. ఇక ఎదుటి వ్యక్తిలో తనను ఆకర్షించే విషయాల గురించి మాట్లాడుతూ..'కళ్లు మన మనసుకు ప్రతిబింబాలు. కళ్లతో పలికించే హావభావాలను నేను నమ్ముతాను. నవ్వుతూ ఉండే వ్యక్తులను ఇష్టపడతాను. అలాగే ఎదుటివారిని గౌరవించే వారంటే నాకు ఇష్టం' అని తెలిపారు.